కొలువుదీరిన గణనాథులు

• ఘనంగా వినాయక చవితి వేడుకలు


అక్కయ్యపాలెంలో ఆకట్టుకుంటున్న గణపతి...


గణపతిని దర్శించుకుంటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు తదితరులు


గణపతిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ రవీంద్రబాబు


సంతోషిమాత కాలనీలో గణనాథుడిని దర్శించుకుంటున్న భక్తులు


కంచరపాలెంలో ఏర్పాటు చేసిన పందిరిలో గణనాథుడితో చిన్నారులు


సత్యానగర్‌లో ప్రతిష్ఠించిన గణపతి


బాలభాను పాఠశాలలో విజయగణపతి

సీతంపేట: విఘ్న సంహారకా.. అని శరణు వేడగానే గజానన రూపంతో కళ్ల ముందు కదిలే దైవం గణేశుడు. సకల విఘ్నాలను తొలగించి, చల్లగ కాచే తండ్రి వినాయకుడు. ఆ ఆది దేవుడికి వినాయక చవితి సందర్భంగా ఊరూవాడా, వీధి వీధినా చలువ పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసి భారీ విగ్రహాలను కొలువుదీర్చారు. వినాయక నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం, సాయంత్రం పూజలు, భజనలు, తీర్థ ప్రసాద వితరణలతో ప్రతి మండపం.. ఓ ఆధ్యాత్మిక మందిరమే అయింది. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో వినాయక చవితి వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 26వ వార్డు అక్కయ్యపాలెం సరోజ ఆస్పత్రి కూడలిలో న్యూ ఫ్రెండ్స్ సంపత్ వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హనుమాన్ సహిత వినాయకుని విగ్రహం భక్తులను ఆకట్టుకుంటోంది.

వైఎస్సార్‌సీపీ ఉత్తర కార్యాలయంలో..

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులోని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో విజయ వినాయక నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రిని కేకే రాజు సత్కరించి, గణనాథుడి చిత్ర పటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, 14వ వార్డు కార్పొరేటర్ కటారి అనిల్ కుమార్‌రాజు, కిరణ్‌రాజు, ఆళ్ల శివగణేష్, అంబటి శైలేష్, నీలి రవి, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, వి.ప్రసాద్, మండల ఇన్‌చార్జి అమర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బి.జగదీష్, వార్డు అధ్యక్షులు రత్నాకర్, పైడి శ్రీను, పాండవ శ్రీను, వసంతల అప్పారావు పాల్గొన్నారు.

కంచరపాలెం: జీవీఎంసీ 46, 47, 48, 54 వార్డుల్లోని కంచరపాలెం, ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతాల్లో గణేష్ వేడుకలు ప్రారంభమయ్యాయి. గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులో పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన మండపాలను వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ దర్శించుకున్నారు. వార్డు నాయకులు సన్ని, హరిపట్నాయక్, నేపాల్ శ్రీను, దుర్గ, నాయుడు తదితరులు పాల్గొన్నారు. సంతోషిమాత కాలనీలో బాలగణేష్ యూత్ అసోసియేషన్, వైఎస్సార్ నగర్‌లో వైఎస్సార్ యూత్ బాయ్స్, లక్ష్మీనారాయణపురం, తారకరామానగర్‌లలో ఏర్పాటు చేసిన మండపాలు ఆకట్టుకుంటున్నాయి.

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వేడుకలను డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు ప్రారంభించారు. సత్యానగర్‌లో స్థానిక గ్రామ ప్రజల ఆధ్వర్యంలో వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. నెహ్రూనగర్, మురళీనగర్, సూర్యానగర్, పట్టాభిరెడ్డితోట, వర్మా కాంప్లెక్స్ పరిసరాల్లో ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేసి గణనాథుడిని ప్రతిష్ఠించారు. మురళీనగర్ సెక్టార్-8లోని బాలభాను విద్యాలయంలో వెలసిన విజయగణపతికి ప్రత్యేక పూజలు అనంతరం పంచామృతాభిషేకం చేశారు.

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు పీఅండ్‌టీ కాలనీలో సంపత్ వినాయగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమలాపురం మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ పి.రవీంద్రబాబు దర్శించుకుని పూజలు చేశారు.

జయహో.. దుర్గాగణపతి


సీతంపేటలో వెండి తొడుగు అలంకరణలో...

సీతంపేట: స్థానిక సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయంలో వినాయక నవరాత్రి మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజున దుర్గాగణపతి నిజ రూపంలో వెండి తొడుగు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి దర్శనం కోసం ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. ఆలయం వద్ద సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ఈవో రమాబాయి ఏర్పాట్లు పర్యవేక్షించారు. రెండో రోజు మంగళవారం స్కంద గణపతి అలంకరణలో దుర్గాగణపతి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం భక్తి రంజని కార్యక్రమం అలరించింది. బుధవారం వాణి గణపతి అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిస్తారని కార్పొరేటర్ గోవింద్ తెలిపారు.


సీతంపేటలో నృత్యప్రదర్శనతో అలరిస్తున్న కళాకారులు

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మురళీనగర్: మర్రిపాలెం సెక్షన్ పరిధి గ్రీన్‌గార్డెన్స్ 11 కేవీ ఫీడర్‌కు నిర్వహణ పనులు కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్ – 2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పార్వతీనగర్, హౌస్సేన్‌నగర్, పంజాబ్ హోటల్ కూడలి, గ్రీన్ గార్డెన్స్, సాయినగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

వైభవుని ఆలయంలో పూజలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వైభవ వేంకటేశ్వరుడి ఆలయంలోని విశ్వక్సేనుడికి వినాయక చవితి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యుల ఆధ్వర్యంలో విశ్వక్సేనుడికి పంచామృతాభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు, ఈవో బి.ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఏఎన్‌ఆర్ శత జయంతి వేడుకలు

మద్దిలపాలెం : నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు కళాభారతి ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం నిర్వహించనున్నామని నిర్వాహకుడు చెన్నా తిరుమలరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకలో కళాంజలి సినీ సంగీత సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఎచటకోయి నీ ప్రయాణం అనే శీర్షికతో అక్కినేని నాగేశ్వరరావుకు స్వర నీరాజనం అందించనున్నారన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనన్నారు.

కల్యాణం.. కమనీయం


యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నేడు గడువు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి బుధవారంతో గడువు ముగియనుందని కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ఓఏఎండీసీ నుంచి అలాంట్ అయిన కాపీతో పాటు సర్టిఫికేట్లతో కళాశాలకు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు. సాయంత్రం 5గంటలతో గడువు ముగుస్తుందని సూచించారు.

మహిళకు ఆశ్రయం


లక్ష్మిని నిరాశ్రయ వసతి గృహానికి తరలిస్తున్న ఏయూటీడీ మేనేజర్ జ్యోతిర్మయి

అల్లిపురం : మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న మహిళకు చికిత్స అందించి ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. టీఎస్ఆర్ కాంప్లెక్స్, ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి తెలిపిన వివరాల ప్రకారం... ఈ ఏడాది ఏప్రిల్ 3న సిరిపురంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వెనుక ఒక మహిళ ఉందని, ఆమెకు మతిస్థిమితం లేదని గుర్తించిన స్థానికులు సమాచారం అందజేశారు. దీంతో ఏయూటీడీ సిబ్బంది ఆమెను చినవాల్తేరు మానసిక చికిత్సాలయంలో చేర్పించారు. అక్కడ చికిత్స తర్వాత ఆమె ఆరోగ్యం కుదుటపడింది. ఏయూటీడీ సిబ్బంది మంగళవారం ఆమెకు టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ఆశ్రయం కల్పించారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


ఏఎస్ఆర్ నగర్‌లో కరపత్రం అందిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు

సీతమ్మధార: రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని నెడ్ క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కేకేరాజు అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 14వ వార్డులోని(1086111) సచివాలయం పరిధిలో ఏఎస్ఆర్ నగర్, క్షత్రీయ కల్యాణ మండపం ప్రాంతాలలో కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజుతో కలిసి ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి నాలుగేళ్ల ప్రభుత్వం అందించి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ పార్టీలు, కుల, మతాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విశాఖ నగరం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, ప్రవీన్ వర్మ, కిరణ్‌రాజు, లింగేశ్వరరావు, డైరెక్టర్ నూకరాజు, రాయుడు శ్రీను, వార్డు అధ్యక్షులుపైడిరమణ, షేక్ బాబ్జీ, వెంకటేష్, బి.గోవింద్,నేపాల్ శ్రీను, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గణేష వైభవ ప్రవచనం


ప్రవచనం చేస్తున్న రమ్యానందభారతి

సీతంపేట: శ్రీలలితాపీఠంలో 'శ్రీగణేష వైభవం'పై శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానందభారతీస్వామినిచే రెండు రోజులుగా నిర్వహిస్తున్న ప్రవచనలహరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రెండో రోజు ఇంద్రుడి ఐరావతాన్ని దుర్వాస మహర్షి శపించిన ఉదంతాన్ని, మార్కండేయ మహర్షి శాపం వల్ల భూలోకంలో ఉన్న గజరాజు గజాసురుడు తల త్రిలోక పూజ్యం అవుతుందని వరం ఇచ్చిన వైనాన్ని వివరించారు. గజాసురుడు శివున్ని ప్రార్థించి తన ఉదరంలో శివుడు ఉండేలా వరం పొందాడని తెలిపారు. గణపతి గాథలో గజాసురుడికి గల ప్రాధాన్యతను హృద్యంగా ప్రవచించారు. లలిత పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి సమక్షంలో జరిగిన ప్రవచన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన


వైద్య శిబిరంలో కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్, వైద్యులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెబాస్టియన్‌కాలనీ, బాబూకాలనీ, జోనల్ కార్యాలయాల్లో వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ జన్మదిన వేడుకల్లో భాగంగా మంగళవారం సెయింట్ జోసెఫ్ కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం, రోటరీ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాలు జరిగాయి. ముందుగా కార్పొరేటర్ పూర్ణిమ వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పేదలకు నిత్యావసర సరకులు, బియ్యం, వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఉచిత కంటి పరీక్షలు, రక్తదాన శిబిరం నిర్వహించారు. యువత రక్తదానం చేయడానికి ముందుగా రావడం అభినందనీమని బ్లడ్ బ్యాంకు వైద్యులు డాక్టర్ మహేష్ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, వేలంగిణి రావు, పాత్రపల్లి సునీల్, ఈశ్వరి, దేవి, అన్నపూర్ణ, జీవీఎంసీ యూసీడీ విభాగం సీవో సత్యవతి, ఆర్పీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మండపాల నిర్వహణకు అనుమతి తప్పనిసరి


నిర్వాహకులకు పాయింట్ బుక్స్ అందిస్తున్న దిశా ఏసీపీ వివేకానంద, సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: వినాయక చవితి మండపాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరని దిశా ఏసీపీ వివేకానంద అన్నారు. ద్వారకా సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో ద్వారకానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాదవ కల్యాణ మండపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మండపం వద్ద ఇద్దరు నిర్వాహకులు రాత్రి పూట ఉండాలని, పాయింట్ నోట్ బుక్ ఉండాలని సూచించారు. నైట్ రౌండ్స్‌లో పాల్గొన్న పీసీ, ఎస్ఐ, బ్లూకోట్స్, సీఐ తనిఖీలు చేస్తారని, బుక్స్‌పై సంతకాలు చేస్తారన్నారు. మండపం వద్ద నీరు, ఇసుక, అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మండపాలు తెరిచి ఉంచాలని, 15 రోజుల పాటు సీసీ కెమెరాల ఫుటేజీలు భద్రపరచాలని సూచించారు. మద్యం సేవించి అల్లర్లు సృష్టిస్తే చట్ట పరమైన చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

సీతమ్మధార: గుట్టుగా పేకాట ఆడుతున్న పేకాటరాయుళ్లను టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధి సీతమ్మధారలో పేకాట ఆడుతున్నట్లు సమాచారంతో టాస్క్‌ఫోర్సు ఏసీపీ త్రినాథరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని, రూ.34 వేల నగదు, ఆరు ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని ద్వారకా పోలీస్‌లకు అప్పగించగా వారు కేసు నమోదు చేశారు.

స్పీడ్ బ్రేకర్ల పరిశీలన


ఐటీఐ జంక్షన్ వద్ద కొత్తగా వేసిన స్పీడ్ బ్రేకర్లను పరిశీలిస్తున్న అధికారులు

మర్రిపాలెం: కంచరపాలెం నుంచి ఎన్ఏడీ కొత్త రోడ్డు వరకు ఉన్న బీఆర్‌టీఎస్ మార్గంలో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా పరిశీలించారు. ప్రమాదాల నివారణకు అధికారులు ఇటీవల వీటిని ఏర్పాటు చేశారు. జోన్ – 2 ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్‌కుమార్, సీఐ మళ్ల అప్పారావు, జీవీఎంసీ ఈఈ తార ప్రసన్న రెడ్డి, డీఈ ఏడుకొండలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నింబంధనలు పాటిస్తూ నిర్దేశించిన మార్గంలోనే ప్రయాణాలు సాగించాలని సూచించారు. బస్సులు మాత్రమే మధ్య రోడ్డులో ప్రయాణించాలని, ఇతర వాహనాలు సర్వీసు రోడ్డులో మాత్రమే వెళ్లాలని, అందరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని కోరారు.

గ్రీవెన్స్‌కు విశేష స్పందన

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లే అవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో మంగళవారం నెడ్ క్యాప్ చైర్మన్, నియోజకవర్గం సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజలు తీసుకొచ్చిన వినతులు కేకే రాజు పరిశీలించి సమస్యలు పరిష్కరించారు. మరికొన్నింటిని అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఫిర్యాదు బాక్స్‌లు ఏర్పాటు చేయండి


రవీంద్రభారతి స్కూల్‌లో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేస్తున్న సీతారాం, తదితరులు

సీతమ్మధార: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థుల హక్కుల పరిరక్షణ, సంక్షేమంలో భాగంగా ఫిర్యాదు బాక్స్‌లు ఏర్పాటు చేయాల్సిందేనని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచనల మేరకు ద్వారకానగర్ మొదటి లైన్‌లోని రవీంద్రభారతి పాఠశాల ప్రాంగణంలో మంగళవారం ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ యాజమాన్యం, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు సంయుక్తంగా ప్రతీ ఫిర్యాదును నిర్దేశించిన సమయంలో నిశితంగా పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. బాలల హక్కులు పరిరక్షించాల్సిన పూర్తి బాధ్యత అన్ని పాఠశాలల యాజమాన్యాలపై ఉందని, వీరి హక్కుల ఉల్లంఘన జరిగితే పాఠశాలలపై తీవ్ర చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. సీతమ్మధార మండల విద్యాశాఖాధికారి రామారావు, స్కూల్ చీఫ్ జనరల్ మేనేజర్ జి.వసంత, జిల్లా బాలల సంరక్షణాధికారి రమేష్, అర్బన్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి శ్రీలత, సీఆర్ఎంటీ రాధ, వార్డు సచివాలయం అడ్మిన్ భవ్యశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుర్గాగణపతి సన్నిధిలో ఎమ్మెల్సీ కల్యాణి


ఎమ్మెల్సీ వరుదు కల్యాణిని సత్కరిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మంగళవారం సాయంత్రం సీతంపేటలోని దుర్గాగణపతి ఆలయాన్ని దర్శించారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్.. ఆమెను సత్కరించి ప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

21న సహస్ర తులసిపూజ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 21న సహస్ర తులసి పూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో శిరీష తెలిపారు. పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

లలిత సంగీతాభివృద్ధికి ఎనలేని కృషి

సీతంపేట: స్వర రంజని లలిత సంగీత సాంస్కృతిక సంస్థ 34వ వార్షికోత్సవం మంగళవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకులు వి.వి.రమణమూర్తి, వి.నాంచారయ్య, వి.శ్రీమన్నారాయణ, శివల రఘురామ్, కె.బ్రహ్మాజీ హాజరై వేడుకలను ప్రారంభించారు. సంస్థ అధ్యక్షురాలు లతారాములు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు సంస్థ ప్రధాన కార్యదర్శి కోరుకొండ రంగారావు వ్యాఖ్యానం చేయగా, ప్రోగ్రామ్ కన్వీనర్‌గా ఎం.రూపవాణి వ్యవహరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ 1989లో కొననా స్థాపించిన స్వరరంజని సంస్థ ద్వారా లలిత సంగీత అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ప్రస్తుత కార్యవర్గ సభ్యులు, గాయనీ గాయకులు చక్కనిరీతిలో వార్షికోత్సవం జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. లతారాములు, పి.వి.పదిమని, కోరుకొండ రంగారావు, మరువడ లక్ష్మి, ఎంవీఆర్ నాగేశ్వరరావు, దుర్గాప్రసన్న, కోరుకొండ లీలాకుమారి, మాధవి, జగదీష్, ఆత్రేయ, రాధాకృష్ణ, కుసుమ, మొగిలి, జి.వి.త్రినాథ్, లక్ష్మీనాయుడు, చలుమూభాయ్, అరుంధతి, చంద్రకళ, ధనలక్ష్మి, భరణి గీతాలు ఆలపించారు.

యువకుడి ఆత్మహత్య

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అములోజు శ్రీనివాస్ (34) భార్య శ్రావణి, 9 నెలల కుమార్తె రిత్వికతో కలిసి కంచరపాలెంలో నివసిసున్నాడు. కుటుంబ కలహాల కారణంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో మంగళవారం ఉదయం ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ తండ్రి అములోజు ప్రసాద్ పెందుర్తి నుంచి వచ్చి కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఎస్ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో ఒకరు...

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నాడు. పిల్లి శివ(40) అనే వ్యక్తి భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి మురళీనగర్ బృందావన్ పార్కు వద్ద నివసిస్తున్నాడు. కారు డ్రైవర్‌గా పని చేసేవాడు. ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. అనారోగ్యంతో కొంత కాలంగా బాధపడుతున్నాడు. భార్య ఇంటి పనులకు వెళ్తుంటుంది. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనంతరం గమనించిన భార్య పిల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.